ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా అంజన్‌కుమార్

- రెండు సార్లు ఎంపీ. ప్రస్తుతం ఎమ్మెల్యేగా పోటీ
- కాంగ్రెస్ శేణుల సంబరాలు
- నిరాశలో ఆశావహులు


అంజన్‌కుమార్‌యాదవ్ కాంగ్రెస్ అభ్యర్థి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ పేరును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి రెండుసార్లు ఎంపీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం అధిష్టానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.

గత ఎన్నికల్లో పార్టీకి 36 వేల ఓట్లు..

2018లో అంజన్‌కుమార్ కుమారుడు అనిల్‌కుమార్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి 36 వేల ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఈ దఫా ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో పార్టీ అంజన్‌ను ఎమ్మెల్యేగా పోటీ చేయాలని సూచించడంతో ఆయన పేరు ఖరారైంది.

పోటీపై ఉత్కంఠ ..

గత అనేక నెలలుగా తండ్రి పోటీ చేస్తాడా..? లేక కుమారుడు పోటీ చేస్తాడా.. అనే ఉత్కంఠకు తెరపడినట్టైంది. 5-5-1961లో జన్మించిన అంజన్ బీఏ చదువుకున్నారు. పాత బస్తీలోని గొల్లకిడికి అతడి జన్మస్థలం.

- 2004లో సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి పోటీచేసి అప్పటి యూనియన్ మంత్రి, బీజేపీ అభ్యర్థి బండారు దత్తాత్రేయపై 70 వేల మెజార్టీతో విజయం సాధించారు.
- 2009లో కూడా సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి బండారు దత్తాత్రేయను ఓడించి విజయం సాధించారు. ఏఐసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా, 2001-2004 వరకు నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఏపీ స్టేట్ యూత్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, చార్మినార్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు.
- 1988లో కాంగ్రెస్‌లో చేరిన అంజన్ పలు కార్యక్రమాలు, కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.


రాంనగర్ చౌరస్తాలో కాంగ్రెస్ శేణుల సంబరాలు

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు..

అంజన్‌కుమార్‌యాదవ్ పేరును అదిష్టానం ప్రకటించడంతో ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలను పంచిపెట్టారు. మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్, బీ-బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, మేడి సురేష్, కవిత, లింగంగుప్తా, యాదవ రెడ్డి, పట్నం నాగభూషణంగౌడ్, సందీప్‌గౌడ్, పెండెం శ్రీనివాస్‌యాదవ్, కృష్ణవేణి తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఇంకా నాకు అవకాశం ఉంది..



అక్టోబర్ 13న నామినేషన్ విత్‌డ్రా వరకు నాకు టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మీద ఉన్న అభిమానంతో లోక్‌జనశక్తి పార్టీ ఏపీ శాఖను కాంగ్రెస్‌లో విలీనం చేశాను. కానీ అనతికాలంలోనే ఆయన మరణంతో నాకు కాంగ్రెస్ పార్టీలో అవకాశాలు రాకుండా పోతున్నాయి. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీల మీద ఉన్న నమ్మకంతో పార్టీ కోసం పనిచేస్తున్నాను. స్థానికతతో పాటు బలమైన పద్మశాలీ కమ్యూనిటీకి చెందిన తనకు టికెట్ ఇస్తామని గతంలో ఏఐసీసీ నాయకులు హామీ ఇచ్చారు. మరోసారి వారిని కలిసి విన్నవించుకుంటాను.

– సంగిశెట్టి జగదీష్, టీపీసీసీ ఉపాధ్యక్షులు

టికెట్ ఆశించి భంగపడ్డా..



ముషీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్‌ను ఆశించి భంగపడ్డాను. టికెట్ రానందుకు చాలా బాధ కలిగింది. అన్ని సర్వేల్లోనూ నా పేరు ఉంది. మరో 2-3 రోజుల్లో నా మిత్రులు, శ్రేయోభిలాషులు, ముఖ్య అనుచరులను సంప్రదించి కార్యాచరణను ప్రకటిస్తాను.

– నగేష్‌ముదిరాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) బోజ్జతారకం తెలంగాణ రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన జన్ను సాంబయ్య ఎన్నికయ్యారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో సాంబయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నక్క బిక్షపతి, జన్నువరం లక్ష్మి, ఎడ్ల ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా గాదె రజిత, ఎం.వేణుగోపాల్ తదితరులు ఎన్నికయ్యారు. ఆర్‌పీఐ సీనియర్ నాయకులు బక్కి సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో దళిత, బహుజన వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యంతో పాటు ఉపాధి, ఉద్యోగం తదితర అంశాలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

పూస రాజు నివాసానికి కేంద్ర మంత్రులు



ముషీరాబాద్: బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు, ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ బీజేపీ నాయకులు పూస రాజు నివాసానికి ఇద్దరు కేంద్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు ఆదివారం విచ్చేశారు. ముషీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన గంగపుత్ర ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ సిక్రీ పార్లమెంట్ సభ్యురాలు, కేంద్ర గ్రామీణ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌లు మర్యాదపూర్వకంగా కలిసేందుకు పూస రాజు నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా పూస రాజు సోదరులతో పాటు వారి కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సాధ్వి నిరంజన్ జ్యోతికి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. బీజేపీ నాయకులు రమేష్‌రాం, మద్దూరి శివాజీ, కలకోట అరుణ్‌కుమార్, శక్తిసింగ్, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

జర్నలిస్టు కుటుంబానికి చేయూత

కాచిగూడ: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు దత్తాత్రేయ కుటుంబానికి తోటి జర్నలిస్టులు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. జర్నలిస్టులు అబ్బయ్యగౌడ్, వాజేందర్, ఆంజనేయులు, జేపీ చారి, శ్యామ్‌సుందర్, జెట్టి రాజు, మహేందర్, ప్రవీణ్‌కుమార్, స్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

కాచిగూడ: జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవిశరన్నవరాత్రి మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు సుధాకర్ రావు, సురేష్, సూర్యప్రకాష్ సింగ్, మనోహర్, గోపాల్, వివేక్ ఆనంద్ తెలిపారు. ఆదివారం బర్కత్‌పురలోని దేవి మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవ వేడుకలతో రూపొందించిన బ్రోచర్‌ను వారు విడుదల చేశారు. రోజూ దాదాపు ఐదు వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రకటించారు.

బీసీలకు అండగా నిలిచే పార్టీలకే మద్దతు

కాచిగూడ: బీసీలకు అండగా నిలిచే పార్టీలకే బీసీలు ఓటువేసి గెలిపించాలని, విస్మరించిన పార్టీలకు గుణపాఠం తప్పదని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. రాజకీయాల్లో అన్ని కులాలు, వర్గాలకు సామాజిక న్యాయం దక్కినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీసీదళ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు మల్లేష్ అధ్యక్షతన ఆదివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాయియాదవ్, వెంకటరమణ ఉన్నారు.

టీసీపీఐ తొలి జాబితా విడుదల


అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (టీసీపీఐ) 2023 ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బాగ్‌లింగంపల్లి పార్టీ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సుదమల్ల వెంకటస్వామి విడుదల చేశారు. కొంతం మాధవరెడ్డి (ఇబ్రహీంపట్నం), కుర్మెటి శేఖర్(ఎల్‌బీనగర్), లింగాల శ్రీనివాస్ (చేవెళ్ల), పిట్ల మహేశ్వర్ (వికారాబాద్), వంగర సాంగయ్య(భూపాల్‌పల్లి), ఎర్ర చంద్రమౌళి(హన్మకొండ), కొతి ఇందిరా(తుంగతుర్తి), వీసం నాగార్జున(నాగార్జునసాగర్), అనంత వెంకటేష్ (దేవరకొండ), కె.చంద్రమౌళి (సంగారెడ్డి) తదితరులు పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి ప్రకటించారు.

టికెట్ ఇస్తే పోటీకి సిద్ధం


మహ్మద్ ఎజాజ్

ముషీరాబాద్: వచ్చే ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గ బీఎస్పీ టికెట్ కేటాయిస్తే ముషీరాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధిస్తానని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ ఎజాజ్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ బీఎస్పీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మైనారీలు, ముస్లింలు 40 వేల మందికి పైగా ఉన్నారని వారితో పాటు బడుగు, బలహీన వర్గాలు బీఎస్పీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి సైతం తీసుకెళ్లామన్నారు. కరోనా సమయంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు.

బీజేపీ ర్యాలీ

కాచిగూడ: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీజేపీ జెండాను ఎగురవేస్తామని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధానకార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయనతో పాటు బీజేపీ పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. గత 9 ఏళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. విజయ తులసి, కవిత, కార్తీక్, భరత్, తులసి తదితరులున్నారు.


నారాయణగూడలో ర్యాలీగా వెళ్తున్న కేశబోయిన శ్రీధర్

బీఆర్‌ఎస్ సంబురాలు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సంబరాల్లో..

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టోతో ఆ పార్టీ శ్రేణుల సంబరాలు చేసుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి, పార్టీ శ్రేణులు నినాదాలతో హోరెత్తించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, సిదార్థ ముదిరాజ్, మేడి ప్రసాద్ సింగీతం సాయి తదితరులున్నారు.

రాష్ట్రాభివృద్ధిని సూచించేలా మేనిఫెస్టో

ముషీరాబాద్: సీఎం కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజా రంజకమైందని బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని సూచించేలా ఈ మేనిఫెస్టో ఉందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్లను దశలవారీగా పెంచుతూ రూ.5016లకు పెంచుతున్నామన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు ఇది ఎంతో ఊరటనిస్తాయన్నారు. ప్రస్తుతం రూ.1160లు ఉన్న గ్యాస్ సిలిండర్‌ను సబ్సిడీ కింద రూ.400లకే ఇస్తామని ప్రకటించడం కూడా పేదలకు ఎంతో ఉపశమనం కలిగించేలా ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.15 లక్షలకు పెంపు, మహిళలకు రూ.3 వేల భృతి, ఇళ్లులేని వారికి ఇళ్ల స్థలాలు, మహిళల సమాఖ్యలకు సొంత భవనాలు, రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యం అందిస్తామనడం శుభ పరిణామన్నారు. ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు మద్దతుగా..

మేనిఫెస్టోను స్వాగతిస్తూ.. ముషీరాబాద్ చౌరస్తా, భోలక్‌పూర్, రాంనగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ముఠా జైసింహ, సోమసుందర్, శివముదిరాజ్, నర్సింగ్‌ప్రసాద్, శ్రీధర్‌చారి, బల్లా ప్రశాంత్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, రాంనగర్ చౌరస్తాలో రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావుల పాటి మోజెస్ తదితరులున్నారు.


అభినందిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్

మరోసారి గెలుపు ఖాయం..

- నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమని తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్నారు. ముఠా గోపాల్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తిరిగి బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కడతాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ తదితరులున్నారు.


ముషీరాబాద్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

సస్పెండ్ చేసిన అధికారులను విధుల్లోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బొమ్మిరెడ్డి కృపాకర్‌రెడ్డి

కాచిగూడ: అకారణంగా నల్గొండజిల్లాలో సస్పెండ్ చేసిన వ్యవసాయ అధికారులను తిరిగి విధుల్లోకి తీసుకుని సొంత జిల్లాలకు పంపించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బొమ్మిరెడ్డి కృపాకర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నారాయణగూడలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయడంతో జిల్లాలోని కొన్ని మండలాల్లో సరఫరాలో రెండు మూడు రోజులు అంతరాయం జరిగిందని, యూరియా కొరత లేదన్నారు. సరఫరా జాప్యానికి బాధ్యులను చేస్తూ.. వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వకుండా సస్పెండ్, ఇతర జిల్లాలకు బదిలీ చేయడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ, అభివృద్ధి ప్రభుత్వమని, రైతుబంధు, రైతుబీమా పథకాలు, వరిధాన్యం కొనుగోలు, రైతు రుణమాఫీ, పీఎంకిసాన్ వంటి కార్యక్రమాలను ఎలాంటి అవినీతికి తావులేకుండా సమర్థవంతంగా అమలు జరిగేలా వ్యవసాయ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వంలోని అన్ని విభాగాల్లో ప్రమోషన్లు జరుగుతున్నాయని, వ్యవసాయశాఖలో ప్రమోషన్లు ఇవ్వడం లేదని, అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సస్పెండైన అధికారులను వెంటనే సస్పెన్షన్ ఎత్తివేసి వారికి అదే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు నిజాయితీగా సేవలందిస్తున్న మండల వ్యవసాయ అధికారులకు కార్యాలయాల నిర్వహణ, వాహనసౌకర్యం, కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్నెట్, అటెండర్, కార్యాలయ నిర్వాహణ ఖర్చులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయశాఖలో కూడా కొత్త మండల, జిల్లాలకు పోస్టులు మంజూరు చేసి ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కృపాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, విజయనిర్మల, సంతోషి, మానస, రమ్యశ్రీ, గిరిప్రసాద్, యాకయ్య తదితరులున్నారు.

కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

చిక్కడపల్లి: తెలంగాణ పూల పండుగ బతుకమ్మ వేడుకల్లో భాగంగా బతుకమ్మ పండుగను గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సతీమణి ఉమాలక్ష్మణ్, కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్‌లు పాల్గొని ఆటపాటలతో బతుకమ్మ ఆడారు. వారు మాట్లాడుతూ.. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మను రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ పూజించి గౌరవించే సంప్రదాయమైన బతుకమ్మ పండుగ అన్నారు. రాజశ్రీ, జగన్నాథ, దేవి, స్వర్ణ, సత్య, వసంత, జ్యోతి, సంగీత, కల్యాణి, సత్యవాణి, పాల్గొన్నారు.


బతుకమ్మ వేడుకల్లో ఎంపీ లక్ష్మణ్ సతీమణి ఉమ, కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

అబ్దుల్‌కలాం స్మారక పురస్కారం ప్రదానం


పురస్కారాలను ప్రదానం చేస్తున్న బైస దేవదాసు తదితరులు

చిక్కడపల్లి: మానస ఆర్ట్ థియేటర్స్ త్యాగరాయగానసభ సంయుక్త నిర్వహణలో త్యాగరాయ గానసభలో భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం 92వ జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా బైస దేవదాసు పాల్గొని కలాం స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. సామాజిక సేవకులు కడారు సత్యమూర్తి, ప్రపంచ పర్యాటక చరిత్రల రచయిత్రి, గాయని నర్మదారెడ్డికి బహూకరించి మాట్లాడారు. భారత జాతి కీర్తిని అంతరిక్ష పరిశోధన రంగంలో ప్రపంచ పటంలో నిలిపేందుకు కృషి చేసిన కలాం దేశ రాష్ట్రపతిగా ఆదర్శనీయులని కొనియాడారు. ప్రముఖ రచయిత అంబల్ల జనార్దన్ అధ్యక్షత వహించిన ఈ సభలో సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొనగా.. రఘుశ్రీ స్వాగతం పలికారు. వాణీ రమాసుందరి శిష్యబృందం నృత్యప్రదర్శన చేశారు. సంస్థ అధ్యక్షుడు రామచంద్రరావు పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

పేకాట ఆడుతున్న 11 మంది అరెస్ట్

కాచిగూడ: గుట్టుచప్పుడు కాకుండా చెప్పల్ బజార్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని కాచిగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.8100 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైన్స్‌షాపుపై దాడి.. కేసు నమోదు

కాచిగూడ: మద్యం మత్తులో ఇద్దరు యువకులు వైన్స్‌షాప్‌పై దాడిచేసి కంప్యూటర్‌ను ధ్వంసం చేసిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హెచ్. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు మూసివేస్తున్న సమయంలో బార్‌షాప్ వద్దకు వెళ్లి మద్యం బాటిల్ కావాలని అడగడంతో సిబ్బంది నిరాకరించడంతో షాప్‌లోని కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన వెంకట్ (24) శివసాయి (20) స్నేహితులు. కాగా శనివారం అర్ధరాత్రి గోల్నాక కూరగాయల మార్కెట్‌లోని దుర్గా సాయి బార్‌కు వెళ్లగా.. అప్పటికే బార్‌ను మూసివేశారు. ఈ క్రమంలో వారు బలవంతంగా బార్ ఆఫీస్‌లోకి చొచ్చుకొని వెళ్లి కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. బార్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి వేడుకలు


మహంకాళి ఆలయంలో అమ్మవారి దర్శనానికి హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారి ఆలయాల దర్శనానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కేంద్రమంత్రి ప్రత్యేక పూజలు..

అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అమ్మవారిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంబర్‌పేట దేవస్థాన సేవ సమితి ప్రతినిధులు స్వాగతం పలికి ప్రత్యేకంగా సత్కరించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, స్థానిక బీజేపీ శ్రేణులు ఉన్నారు. దేవస్థాన సేవ సమితి ప్రతినిధి జ్ఞానేశ్వర్‌గౌడ్, శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, శ్రీధర్‌గౌడ్, కిషోర్ తదితరులున్నారు.


శంకరమఠంలో బ్రాహ్మీ అలంకరణలో శారదాంబ

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ ప్రాంగణంలోని శ్రీ భువనేశ్వరిగా అమ్మవారు బాల త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి దేవనాథం, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మ పాల్గొన్నారు. లక్ష్మీగణపతి దేవాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ చైర్మన్ ప్రభాకర్, ఈఓ దేవనాథం పాల్గొన్నారు.

శంకరమఠంలో శారదాంబగా..

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో శారదా శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్ర పర్వంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం పండితులు మంత్రోచ్ఛరణల మధ్య కలశ స్థాపన చేశారు.

న్యూ రామాలయంలో..

న్యూ నల్లకుంటలోని రామాలయంలో జ్ఞాన సరస్వతి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సరస్వతి మాత బాలా త్రిపురసుందరి దేవిగా దర్శనమివ్వగా.. పెద్దఎత్తున అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సోమవారం మంగళగౌరీగా భక్తులకు దర్శనమిస్తుందని ఆలయ ఈఓ కె. జయంతి ప్రకటించారు.

'మనుషులమై బతకాలి' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కవి దివాకర చారి రచించిన 'మనుషులమై బతకాలి' పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడేలా దివాకర చారి రచించిన ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి పుస్తకాలు సమాజాన్ని చైతన్యం చేసే విధంగా ఉంటాయన్నారు. తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందచారి, పాలపిట్ట సంపాదకులు గుడిపాటి, ప్రముఖ విమర్శకులు జ్యోతి, తంగిరాల చక్రవర్తి, అనంతోజు మోహనకృష్ణ, కవులు డీ.వీ.సుబ్బారావు, దాసరి మోహన్ తదితరులున్నారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం